AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

1-11-2025 (Saturday) MAIN EDITION

## ఢిల్లీ పేరు మార్చాలని డిమాండ్



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** దేశ రాజధాని ఢిల్లీ పేరు మార్చాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. 'ఇంద్రప్రస్థ'గా మార్చాలని ఇటీవల వీహెచ్‌పీ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా చాందినీ చౌక్‌కు చెందిన బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్‌వాలా ఇదే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పలు ప్రాంతాలు, రోడ్ల పేర్లను మార్చిన విషయం తెలిసిందే. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా వలస పాలనకు చిహ్నంగా ఉన్న పేర్లను తొలగించారు. ఈ క్రమంలో దేశ రాజధాని పేరు మార్చాలనే డిమాండ్ తెరపైకి రావడం గమనార్హం.

## తుపాకీ వెంకట్రావులా సీఎం వ్యాఖ్యలు: ఎర్రబెల్లి



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ మాటకారి అని, తుపాకీ వెంకట్రావులా మభ్యపెడతారని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా శనివారం ఆయన ప్రచారం చేశారు. జూబ్లీహిల్స్ పోరు సమీస్తుండడంతో ప్రధాన పార్టీలు ప్రచారంలో వేగం పెంచాయి. సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శుక్రవారం రోడ్ షోలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా శనివారం ఉదయం ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రచారం చేశారు.

## 'అయితే 150.. లేదంటే 10 సీట్లు'



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీకి 150 కంటే ఎక్కువ సీట్లు వస్తాయని ధీమా వ్యక్తంచేశారు. ఒకవేళ ప్రజలు తిరస్కరిస్తే 10 కంటే తక్కువ సీట్లకే పరిమితం కావొచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## తొలి దారిద్ర్య రహిత రాష్ట్రంగా కేరళ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దారిద్ర్య రహిత రాష్ట్రంగా కేరళ అవతరించినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరై విజయన్ ప్రకటించారు. దేశంలో అత్యంత దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా గుర్తింపు పొందిందన్నారు. కేరళ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం ఈ విషయాన్ని వెల్లడించారు.

## భారీగా సైన్యాన్ని మోహరించిన రష్యా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉక్రెయిన్‌లోని తూర్పు దొనెస్క్ ప్రాంతంలో రష్యా దాదాపు 1,70,000 మంది సైనికుల్ని మోహరించిందని అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ శుక్రవారం ఆరోపించారు. అయితే వారు పొక్రొవిస్క్ నగరాన్ని స్వాధీనం చేసుకోకుండా తమ బలగాలు సమర్థంగా తిప్పికొడుతున్నాయని తెలిపారు.

# ఆలయంలో తొక్కిసలాట

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట చోటు చేసుకొని తొమ్మిది మంది భక్తులు మృతి చెందారు. కార్తీక ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు భారీగా తరలి రావడంతో ఈ ఘటన జరిగింది. రెయిలింగ్ ఊడిపోవడంతో పలువురు భక్తులు కిందపడి ఊపిరాడక మృతి చెందారు.

–అక్షరటుడే, ఆంధ్రప్రదేశ్



- శ్రీకాకుళం కాశీబుగ్గ వేంకటేశ్వరాలయంలో ఘటన
- 9 మంది భక్తుల మృతి.. పలువురికి గాయాలు
- ఏకాదశి సందర్భంగా భక్తులు పోటెత్తడంతో ప్రమాదం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి నిత్యం వెయ్యి మంది భక్తులు వస్తుంటారు. ప్రతి శనివారం భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. అయితే ఈ ఆలయ సామర్థ్యం 2వేల నుంచి 3 వేలు మాత్రమే. కాగా.. కార్తీక మాసంలో శనివారం, ఏకదాశి కలిసి రావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. దాదాపు 25 వేల మంది వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో రద్దీ అధికంగా ఉండడంతో భక్తుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. రెయిలింగ్ విరిగిపోయి పలువురు భక్తులు కిందపడ్డారు. దీంతో తొక్కిసలాట చోటు చేసుకొని ఏడుగురు అక్కడిక్కడే మృతి చెందగా.. చికిత్స పొందుతూ ఇద్దరు చనిపోయారు. మృతుల్లో 8 మంది మహిళలు, 12 ఏళ్ల బాలుడు ఉన్నారు.

### 12 ఎకరాల్లో ఆలయం

కాశీబుగ్గలో నాలుగేళ్ల క్రితం వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణాన్ని ధర్మకర్త హరిముకుంద్ పండా ప్రారంభించారు. 12 ఎకరాల సొంత భూమిలో రూ.20 కోట్లతో దీనిని నిర్మించారు. ఈ ఏడాది మే నుంచే ఆలయంలో దర్శనాలు ప్రారంభం అయ్యాయి. అయితే తనకు తిరుపతిలో వేంకటేశ్వర స్వామి దర్శనం కాకపోవడంతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టినట్లు సమాచారం.

### మొదటి అంతస్తులో గుడి

వేంకటేశ్వర స్వామి ఆలయం మొదటి అంతస్తులో ఉంది. దీంతో భక్తులు మెట్లపై నుంచి వెళ్తున్న క్రమంలో రెయిలింగ్ ఊడిపోయింది. భక్తులు అధిక సంఖ్యలో రావడం, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు లేకపోవడంతో తొమ్మిది మంది చనిపోయారు. ఈ ఘటనలో మరో 12 మంది గాయపడ్డారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అయితే గాయపడ్డ వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

### ప్రైవేట్ టెంపుల్

తొక్కిసలాట ఘటన జరిగిన ఆలయం దేవాదాయశాఖ పరిధిలో లేదని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అది పూర్తిగా ప్రైవేట్ ఆలయం అన్నారు. నిర్వాహకులు సరైన భద్రతా ఏర్పాట్లు చేయలేదని ఆయన చెప్పారు. ప్రభుత్వానికి నిర్వాహకులు సమాచారం ఇవ్వలేదన్నారు. ముందే సమాచారం ఇచ్చి ఉంటే.. భక్తుల రద్దీ మేరకు ఏర్పాట్లు చేసేవాళ్లమని తెలిపారు.

### మృతులకు పరిహారం

కాశీబుగ్గ ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడ్డవారికి రూ. 50 వేల పరిహారం ఇస్తామని తెలిపారు.

తొక్కిసలాట ఘటన తీవ్రంగా కలిచివేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. తొక్కిసలాట ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో ప్రయాణికులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. జెడ్డా నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వస్తున్న విమానంలో బాంబు ఉందని మెయిల్ వచ్చింది. జెడ్డా నుంచి బయలుదేరిన ఇండిగో విమానంలో బాంబు పెట్టినట్లు మెయిల్ వచ్చింది. దీంతో సెక్యూరిటీ అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. శంషాబాద్‌కు రావాల్సిన ఫ్లైట్‌ను ముంబయి ఎయిర్ పోర్ట్‌కు దారి మళ్లించారు. అనంతరం విమానంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేసి అది నకిలీ బెదిరింపుగా గుర్తించారు. అనంతరం పోలీసులకు సెక్యూరిటీ అధికారులు ఫిర్యాదు చేశారు.

## ఆలయాల భూముల రక్షణకు ప్రభుత్వం చర్యలు

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలోని దేవాదాయ భూముల రక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏపీ ఎండోమెంట్ యాక్ట్ 1987 సవరణకు కసరత్తు చేస్తోంది. అందులోని సెక్షన్ 83, 84 తొలగించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఆలయాలకు వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. అయితే చాలా వరకు ఆలయ భూములు కబ్జాలకు గురవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, భూములు అక్కడక్కడ ఉండడంతో పలువురు ఆక్రమించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆలయ భూములను రక్షించాలని తెలంగాణ సర్కారు నిర్ణయించింది. ఏపీ ఎండోమెంట్ యాక్ట్, 1987 చాప్టర్ XI సవరణ చేసి కబ్జాలకు పాల్పడే వారి ఆట కట్టించాలని భావిస్తోంది. ఈ మేరకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిల్లు పెట్టడానికి సిద్ధం అవుతోంది.

## అపార్ట్‌మెంట్‌ను కూల్చేసిన హైడ్రా



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన భవనాలను కూల్చి వేస్తోంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం ఉదయం హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. పీజేఆర్ కాలనీ, మియాపూర్ సరిహద్దు ప్రాంతంలో ఐదంతస్తుల అపార్ట్‌మెంట్‌ను హైడ్రా అధికారులు కూల్చివేశారు. అమీన్‌పూర్ సర్వే నంబర్ 337, 338లలో హుడా అప్రూవ్డ్ లే అవుట్‌లో 400 గజాల ప్లాట్ కొని.. పక్కనే మియాపూర్ సర్వే నంబర్ 101లోని దాదాపు 473 గజాలు ఆక్రమించి భాను కన్‌స్ట్రక్షన్ యజమానులు 5 అంతస్తుల భవనం నిర్మించారు. దీనిపై స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన హైడ్రా అధికారులు ఆక్రమణలు నిజమని తేల్చారు. దీంతో శనివారం ఉదయం ఆ భవనాన్ని కూల్చి వేశారు. కూల్చివేతల సందర్భంగా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా భారీగా పోలీసులు మోహరించారు.

## సిబ్బందిపై మంత్రి తుమ్మల ఆగ్రహం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** సకాలంలో కార్యాలయానికి రాని అధికారులపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఆఫీసులో ఆయన శనివారం తనిఖీలు చేపట్టారు. రాష్ట్రంలోని పలు కార్యాలయాల్లో ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదు. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి ఉంది. వివిధ కార్పొరేషన్ల పరిధిలో పని చేసే ఉద్యోగులు సైతం ఇష్టారాజ్యంగా విధులకు హాజరు అవుతున్నారు. ఈ క్రమంలో శనివారం మంత్రి తుమ్మల ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. అయితే ఆయన ఆఫీస్‌కు వెళ్లే సరికి ఉద్యోగులెవరూ రాకపోవడం గమనార్హం. ఆఫీస్ టైం అయినా ఒక్కరు కూడా విధులకు రాకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పాక్ మానవ హక్కుల ఉల్లంఘనలు ఆపాలి: భారత్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అంతర్జాతీయ వేదికగా పాకిస్థాన్‌కు మరోసారి భంగపాటు ఎదురైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనను వెంటనే ఆపాలని భారత్ డిమాండ్ చేసింది. ఐక్య రాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో చర్చ సందర్భంగా మన దౌత్యవేత్త భవిక మంగళానందన్ మాట్లాడుతూ.. పాక్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పీవోకేలో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు కొనసాగుతున్నాయన్నారు. వీటిని వెంటనే ఆపాలని ఆమె డిమాండ్ చేశారు.



## ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన టాయిలెట్..

ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచే విలాస వస్తువుల జాబితాలో మరో అద్భుతం చేరబోతోంది. పూర్తిగా 18 క్యారెట్ల బంగారంతో తయారు చేసిన టాయిలెట్ ఇప్పుడు వేలానికి రాబోతోంది. ఇది సాధారణ టాయిలెట్ కాదు.. ఇటాలియన్ ప్రముఖ కళాకారుడు మారిజియో కాటెలాన్ రూపొందించిన "అమెరికా" అనే పేరుతో ప్రసిద్ధి చెందిన కళాఖండం. ప్రతిష్టాత్మక వేలం సంస్థ సోత్‌బీస్ ఈ నెల 18న న్యూయార్క్‌లో ఈ బంగారు టాయిలెట్‌ను వేలం వేయనుంది. దీని ప్రారంభ ధరను సుమారు 10 మిలియన్ డాలర్లుగా (రూ. 83 కోట్లు) నిర్ణయించారు. 101.2 కిలోల బరువు ఉన్న ఈ టాయిలెట్ పూర్తిగా పనిచేసే విధంగా తయారు చేయబడింది.

– అక్షరటుడే, నేషనల్ డెస్క్

## డొమైన్‌లను మార్చిన బ్యాంకులు

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బ్యాంకులు తమ డొమైన్ పేరును మార్పు చేశాయి. సైబర్ మోసాలను తగ్గించేందుకు, డిజిటల్ లావాదేవీలకు మరింత భద్రత కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా పలు బ్యాంకులు తమ నెట్ బ్యాంకింగ్ వెబ్‌సైట్ల డొమైన్ మార్చుకున్నాయి. '.bank.in' కు మారాయి. డిజిటల్ లావాదేవీలకు మరింత భద్రత కల్పించేందుకు ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సైబర్ మోసాలను తగ్గించేందుకు బ్యాంకులు ప్రస్తుత వెబ్‌సైట్ అడ్రస్‌లను '.bank.in'కు మార్చుకోవాలని ఈ ఏడాది ఏప్రిల్ 21న ఆదేశించింది. దీనికి అక్టోబర్ 31వ తేదీని గడువుగా నిర్దేశించింది.

## 'మొంథా'ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాం: సీఎం

**అక్షరటుడే, అమరావతి:** మొంథా తుపాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాన్‌తో ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. తుపాన్ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. దీంతో నష్టం తగ్గింది. తుపాన్ సమయంలో ఉత్తమ సేవలు అందించిన వారిని తన క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు అభినందించారు. సైక్లోన్ మొంథా ఫైటర్లుగా గౌరవిస్తూ.. సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు అద్భుతంగా పనిచేశారని కొనియాడారు. తుపాన్ అలర్ట్ నుంచే ట్రాకింగ్ మొదలు పెట్టామన్నారు. ఇంత పెద్ద తుపాన్ వచ్చినా ఇద్దరు మాత్రమే మృతి చెందారని చెప్పారు.



## సీఎంను కలిసిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ సర్కారు సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల సలహాదారుగా నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ముఖ్యమంత్రిని కలిసి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సుదర్శన్ రెడ్డిని సీఎం సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, జిల్లాకు చెందిన నాయకులు అరికెల నర్సారెడ్డి తాహెర్ బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, ముత్యాల సునీల్‌రెడ్డి, నగేశ్‌రెడ్డి, కేశ వేణు, కుంట రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– అక్షరటుడే, హైదరాబాద్ సిటీ